ఎందుకైనా మంచిది

రంగారావును అరెస్టు చేశారన్న వార్తను పిడుగులాగా మా ముందు పడేశాడు నాదెళ్ళ. టిప్పును అర్ధణా చొప్పున ఫిల్టర్ ఆడుతున్నవాళ్ళ మంతా ఒక్కసారి ఎగిరిపడ్డాం.

"ఇంతకుముందే జరిగింది" అన్నాడు చమటలూడు కొంటూ.

'ఎప్పుడు' అని అడగబోయి నేను విరమించాను.

"ఎక్కడ?"

"ఎందుకు?"

'చోరీ కేసా?'

"పేకాడ్తుంటేనా?" మా వాళ్ళంతా ఆతృతగా అడిగారు. ఎందుకైనా మంచిదని నేను పేకనుతీసి దాచాను"

"ఆఁ ఏమీలేదు. కమ్యూనిస్టని అనుమానంమీద" అన్నాడు నాదెళ్ళ చొక్కాతో విసురుకుంటూ.

"అంతేగదా," అన్నారు మావాళ్లు చప్పరించి. అంత మాత్రమే అయితే ఫరవాలే దనిపించివుంటుంది.

"రంగారావు అరెస్టువార్త వాళ్ళందరిలో ఏమో గాని నా బుర్రను కదిలించింది. నిజానికి రంగారావు కమ్యూనిస్టు కానేకాదు. రంగారావులాంటి ఆషామాషీ మనుష్యులకు కమ్యూనిస్టుపార్టీ సభ్యత్వమిస్తుందని ఏనాడూ అనుకోలేను. సభ్యుడు కాకపోతే పీడాబాయిని, కనీసం సానుభూతిపరుడన్నా కాదుకదా. అయితే ఒకటిమాత్రం నిజం. రంగారావుకున్న

అసంఖ్యాక స్నేహితగణంలో కొంతమంది కమ్యూనిస్టులున్నారు. అయినా వాడు వాళ్ళతో ఆట్టే పూసుకు తిరిగే వాడుకూడా కాదు. వాళ్ళకుమాత్రం యీ జులాయివెధవతో తిరక్కపోతే వేరే పనులేవా ఏమిటి? ఎక్కడెక్కడి మాల మాదిగ గూడేలూ వాళ్ళవ్యే. ఎక్కడెక్కడి కూలిముండా కొడుకులూ వాళ్ళవాళ్ళే. ఎక్కడెక్కడి అలగాజనమూ వాళ్ళదేనాయె. ఏమాట కామాటే చెప్పుకోవాలి. కమ్యూనిస్టులది రష్యా సిద్ధాంతం అయితేఅయింది కాని వారుచేసే పనులు మాత్రం కాస్తోకూస్తో సన్నజనానికి మెరుగ్గానే వున్నాయి.

ఇన్నిటికీ సంగతేమిటంటే రంగారావుకు కమూనిస్టులతో ఆట్టే పరిచయం లేదు. కమ్యూనిస్టులతో మాట్లాడడమే గొప్పతప్పయితే రంగారావు నిస్సందేహంగా అరెస్టు కావలసిందే. 'రామరాజ్యంలో వాక్స్వాతంత్ర్యం లేకుండా వుంటుందటతే' అనే పిచ్చిభ్రమకు రంగారావు లోబడి వుంటాడు. ఎంత అమాయకుడు!

రంగారావులో ఒక దుర్గుణముంది. అది దుర్గుణమని రంగారావు చచ్చినా వొప్పుకోడు. సద్గుణమని మా ప్రాణాలు పోయినా మేము అనం. వాడిలోవున్న దుర్గుణం అంత చెప్పుకోతగింది కానిమాట నిజమే, కానీ వాడి కొంపకు చిచ్చు పెట్టింది ఆ వెధవబుద్ధే. నిజాన్ని నిజంగాచూస్తాడు; అయితే మేమంతా నిజాన్ని అబద్ధంగా చూస్తామని గాదు. అవసరమొచ్చినప్పుడు నిజాన్ని అబద్ధంగా ఒప్పుకొని సమయానుకూలంగా నడుస్తుంటాం. 'తప్పించుక తిరుగువాడు ధన్యుడు సుమతీ' అని వూరికేచెప్పాడా కవి? రంగారావు దీనికి సుత

రామూ వొప్పుకోడు. "యదార్ధాన్ని వొప్పుకోడానికి ఎందుకు భయపడాలి? నాలుగు ప్లస్ నాలుగూ ఎనిమిది అనేది యదార్థం. ఎవడో చవటపెద్దమ్మ 'కాదు' పది అంటాడనుకో. అప్పుడు వాడిది ఎట్లాతప్పో మన ఆన్సరు ఎట్లా రైటో వాడికి విడమర్చి చెప్పాలి. ఇందువల్ల వాడు మూర్ఖంగా ప్రవర్తిస్తే ప్రవర్తించనూవొచ్చు. కానీ తరవాతనైనా వాడికి నిజం తెలుస్తుంది. అప్పటికన్నా వాడు తను మూర్ఖంగా ప్రవర్తించినందుకు సిగ్గుపడతాడు. హృదయమున్నవాడయితే ఎవరూ చూడకుండా ఏడుస్తాడు—" ఈ ధోరణిలో వుంటుంది రంగారావు వాదన. రంగారావుతో వాదించటమంటే మాకు మహాభయం. వాడు కొడతాడని కాదుగానీ; వెధవ మాచేత 'రైట్' అనిపించుకొంటాడు చివరికి. అంచేత వాడితో వాదానికి దిగం.

నిజాన్ని నిజంగా తనమట్టుకు తాను చూసుకున్నా బాగానేవుంటుంది. ఆ నిజాన్ని పదిమందికీ తెలియచేయా లంటాడు. పాకీవాళ్ళు సమ్మెచేశారు. సమ్మెచేయడం న్యాయమే నని మేమంతా చాటుగా అనుకొన్నాం. రంగారావుగూడా అట్లా అనుకొంటే వాడి తాతగాడిముల్లె ఏంపోయింది? మునిసిపాలిటీవారికీ, షావుకార్లకీ, కాంగ్రెసువాళ్ళకీ రంగారావు మీాద కోప మొస్తుందంటే మరి రాదూ!

పాకీవాళ్లుచేసిన సమ్మె మంచిదేనని మేము ఒప్పుకొని చచ్చాంగా. వాళ్ళకు కూటికిలేదు నెలకు ఆరు రూపాయలతో కుటుంబమంతా గడవాలంటే ఎట్లాచస్తారు? వెధవది, ఆరు రూపాయలు నా సిగరెట్లకు చాలదు మరి - జీతాలు పెంచమని పాపం ముందు ప్రాధేయపడ్డారు. ఎవ్వరూ వినిపించుకో

లేదు. మంత్రులకు రాసుకొన్నారు. తమకు జీతాలు పది హేనువందలు చాల్తాయా? ఇరవైవందలు చేద్దామా? అనే అతి ప్రాముఖ్య ప్రజాకార్యంలో మునిగివుండడంవల్ల మంత్రులకు ఈ వెధవలు రాసుకొన్నది చూసేతీరిక లేకపోయింది. ఆమట్టుని వారు సమ్మెచేశారు. నాలుగురోజులనాటికి గవులు పుట్టుకొచ్చింది. ఈలోగానే కొందరు అతిసుకుమారగాత్రులు మంచాలుపట్టారు. అయిదోరోజున కొందరు కాంగ్రెసువారు బజార్లు వూడిచారు. పెంటవిషయం వాళ్ళకు సంబంధించింది కాదు గాబోలనుకున్నాను. ఎంతమంచి వాళ్ళో! అని విస్తుపోయాను. పెద్దబజారు మాత్రమే వూడిచారు. మిగతాబజార్లు మరిచిపోయారేమోలే అని సమాధానం చెప్పుకొన్నాను. మూడోనాటికల్లా వాళ్ళఫొటోలు పేపర్లోవొచ్చినయ్. ఆశ్చర్యమేమిటంటే 'నగరం ఆమూలాగ్రంగా అసహ్యించుకొనక పరిశుభ్రపరిచిన స్వచ్ఛంద సేవకులు—'

రంగారావు పాకీవాళ్ళతరఫుమనిషయినాడు. మేమాలోపల రంగారావు తరఫూ, బైట మునిసిపాలిటీతరఫు మనుషులమైనాము. అప్పటినుండే రంగారావుకు కమ్యూనిస్టురంగు పూయబడింది. ఆ తరవాత బడిపంతుళ్ళు సమ్మెచేశారు, రైల్వే కూలీలు సమ్మెచేశారు. ఇంకా ఎవరెవరో సమ్మెచేశారు. ఆ సమ్మెలు ఎట్లా న్యాయమైనవో రంగారావు మాకు వొప్పిగ్గా చెప్పేవాడు. వాడు చెప్పిందాన్ని విన్నతరవాత మాకు 'నిజమే' అనిపించేది. ఆంధ్రరాష్ట్రవిషయంలోనూ, హైదరాబాదు విషయంలోనూ, వాడివాదన విన్నవారు వాణ్ని చప్పున కమ్యూనిస్టుల్లోకి నెట్టిపారేశారు.

నిజంగా రంగారావు ఏ 'ఇస్టూ' కాదు. యదార్థాన్ని ఒప్పుకొంటాడు. మసిబూసి మారేడుకాయ చేయలేడు. అంత మాత్రానికే రంగారావుని కమ్యూనిస్టు అన్నారు. నిజంమాట్లాడిన ప్రతివాడూ కమ్యూనిస్టే అయితే కమ్యూనిస్టు కావడానికి సిగ్గుపడవలసిందేమీ లేదు. ఇట్లా అని మేమంతా ఒకసారి అనుకున్నాము.

నిజం మాట్లాడడం, యదార్థాన్ని ఒప్పుకోవడం ఈ రోజుల్లో ఎంత ప్రమాదకరమో రంగారావు అరెస్టు మాకు చూపించింది. నాలుగు ప్రజోపయోగకార్యాలు చేసినవాణ్ణి కమ్యూనిస్టు అంటున్నారు. అందువల్ల ఇబ్బందేమీ లేదు.

ఏది ఏమయినా అరెస్టుకావడం మాలో ఏ ఒక్కరికీ ఇష్టంలేదు. నిజం మాట్లాడి కమ్యూనిస్టు అనిపించుకో దలచ లేదు. అబద్ధంమాట్లాడి కాంగ్రెసు కావడానికే ఒప్పుకొన్నాం. యదార్థాన్ని ఒప్పుకోడం మానేసి మేము కాంగ్రెసువాళ్ళ మయినాం. కాంగ్రెసువాళ్ళ మయినా కాకపోయినా కమ్యూనిస్టులం మాత్రం కాదు. అంతవరకు చాలు.

ఆ సాయంత్రంనుండే మా కొత్త పథకాన్ని మేము ఆచరణలో పెట్టాము.

"రూపాయకు పద్దెనిమిదణాలు" అన్నాడు నాదెళ్ళ. పదహారని మాకు తెలుసు. ఆమాట పైకి అంటే కమ్యూనిస్టు కింద తోస్తారేమోనని మాభయం. మరి నిజం ఒప్పుకుంటే అంతేగా!

"పంచదార కటికవిషం"

"అవునవును"

"పాలరంగు కారునలుపు"

"కాకపోవడ మేమిటి ?"

"కాకులు ఎంత తెల్లగావున్నయ్ !"

"మెల్లిగా అంటావేం ? కళ్ళు చెదిరిపోతుంటే!"

"ఆవుకి రెండు కాళ్ళు"

"ఖచ్చితంగా అంతే"

ఇదీ మా ధోరణి.

ఇళ్ళల్లోగూడా ఇదే తంతు మొదలెట్టాం. ఆడంగులు ఆశ్చర్యపోయారు. మరికాదూ? 'అన్నానికి రండి' అన్నది మా ఆవిడ. 'కాదు, అన్నమే నాకు రావాలి' అన్నాను. 'పిచ్చిపట్టిందా ఏమిటండీ!' అన్నది. 'కాదు. పిచ్చికే నేనుపట్టాను' మా ఆవిడ రణకేక బెట్టింది. చుట్టూ ఎవరూ లేకుండాచూసి దాని చెవిలో అసలు విషయం వూదాను.

—o—